క్లుప్తంగా

జూనియర్ హోమ్లి ర్యాలీ



నృత్య ప్రదర్శన చేసిన బెనితను అభినందిస్తున్న మేజర్ రమణయ్య

దెందులూరు: చిన్నారులు ప్రాథమిక స్థాయి నుంచి విద్య, ఆధ్యాత్మిక మార్గాల్లో పయనించేలా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని దెందులూరు సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ డి రమణయ్య అన్నారు. ఆదివారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిలో జూనియర్ హోమ్లి ర్యాలీ నిర్వహించారు. పలు కుటుంబాలకుచెందిన చిన్నారులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ సిలువ కుమారి మనుమరాలు బెనిత నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా ఆమెను కోర్ ఆఫీసర్, సంఘ పెద్దలు, సంఘస్తులు అభినందించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి

దెందులూరు: రానున్న మూడు రోజులపాటు కోస్తా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలం అన్ని అన్ని ప్రభుత్వశాఖల అధికారుల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బీ సుమతి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ మాట్లాడుతూ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, గంటకి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తుగానే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

శుద్ధీకరణ మాత మహోత్సవాలు ప్రారంభం



జెండా ఎగురవేసిన ఫాదర్ అమ్మన్‌రాజా

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో శుద్ధీకరణ మాత మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పారిస్ ప్రీస్ట్ ఫాదర్ అమ్మన్ రాజా చర్చి ఎదుట జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ శుద్ధీకరణ మాత మహోత్సవాలు తొమ్మిది రోజులపాటు జరుగుతాయని తెలిపారు. పండుగ చివరి రోజున ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫాదర్ కళ్యాణ్, సిస్టర్లు, సంఘ పెద్దలు, సంఘస్తులు, యువత ఉపదేశీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీలకు రూ.450 కోట్ల మంజూరు

ఉంగుటూరు: ఉంగుటూరు, చేబ్రోలు, భీమడోలు, కైకరం ఆర్‌వోబీల నిర్మాణానికి రూ.450 కోట్లు మంజూరైనట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. ఆదివారం నాలుగు ఆర్‌వో బీల నిర్మాణ ప్రదేశాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మెన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే నిర్మాణ పను లు చేపడతారని తెలిపారు. నారాయణపురం డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేయాలని టీడీపీ నాయకుడు బొమ్మిడి అప్పారావు చేబ్రోలులో ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు.

రైతులకు సబ్సిడీపై అపరాలు

దెందులూరు: వ్యవసాయ శాఖ సబ్సిడీపై అందిస్తున్న పెసలు, మినుములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయ న మాట్లాడుతూ పిల్లి పెసర 8 కేజీలు రూ.90కు జీలగ 10 కేజీలు రూ.60కు, సొంపు గింజలు 10 కేజీలు రూ.54కు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు గ్రామాల్లోని వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను సంప్రదించి సబ్సిడీపై అపరాలు పొందాలని కోరారు.

అఖిల భారత ఐక్య రైతు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

వేలేరుపాడు: అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏలూరు జిల్లా మొదటి మహాసభ వేలేరుపాడు మండలం కాచారంలో జరిగింది. ఈ సభలో సంఘం జాతీయ నాయకులు కేఆర్ అన్న, రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే గౌస్ మాట్లాడారు. అనంతరం ఏడుగురు సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడి టగా బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కరాటం వీరాస్వామి, కార్యదర్శిగా సిరికొండ రామారావు, సహాయ కార్యదర్శిగా సోయం చంద్రరావు, కోశాధికారిగా ఊకే బుచ్చయ్య, కంగాల కన్నయ్య, పింకీ వీరబాబు ఎన్నికయ్యారు.

ఎండుగడ్డి వర్షార్పణం

- అకాల వర్షానికి నీటమునిగిన ఎండుగడ్డి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



పొలంలో నీటిలో నానుతున్న ఎండుగడ్డి



యంత్రంతో కట్టలుగా కట్టి గట్టుకు చేర్చిన ఎండుగడ్డి

గణపవరం: పశుగ్రాసానికి ముఖ్యమైన ఎండు గడ్డి ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసి పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండు గడ్డి ప్రియంగా మారడంతో కొనుగోలు చేయలేక సతమతమవుతున్నారు. గతంలో వరికోతలను కూలీలచే కోయించడం వలన రైతులకు ఎండుగడ్డి కావలసినంత అందుబాటులో ఉండేది. గత కొన్నేళ్లుగా వరికోతలకు యంత్రాలను ఉపయోగించడంతో ఎండుగడ్డి మహాప్రియంగా మారి ఎక్కడలేని డిమాండ్ ఏర్పడింది.

వర్షాలకు నీటిపాలు

యంత్రాలతో కోతకోయడం వల్ల ఎండుగడ్డి ముక్కలు ముక్కలుగా చేలల్లోనే ఉండిపోతుంది. ఈగడ్డిని వెంటనే కట్టలుగా కట్టడం వలన గడ్డి ఆయిల్ వాసనతో నిండి నాణ్యత కోల్పోయి, పశువులు సరిగా తినడంలేదు. దీంతో రైతులు యంత్రం కోసిన గడ్డిని కొన్నిరోజుల పాటు చేలల్లోనే వదిలేసి ఎండకు పూర్తిగా ఆరిన అనంతరం యంత్రంతో గడ్డిని కట్టలుగా కట్టి గడ్డివాములుగా వేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో దాళ్వా వరికోతలు దాదాపు పూర్తి కాగా చాలామంది రైతులు మాత్రం తమ పొలాల్లోని వరిగడ్డిని ఇంకా ఒబ్బిడి చేయకుండా చేను గట్టునే ఉంచేశారు. దాదాపు 30శాతం రైతులు వరిగడ్డిని తమ పొలాల్లో వదిలేయడంతో ఇటీవలి వర్షాలకు ఆ వరిగడ్డి కాస్తా నీటిపాలైంది. ఈవారంలో రెండు సార్లు భారీ వర్షాలు కురియడంతో వరి గడ్డి నీటిలో నాని, కుళ్లిపోయి పనికిరాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గణపవరం మండలంలో సుమారు 13 వేల ఎకరాల విస్తీర్ణంలో రబీసాగు చేయగా సుమారు 5 వేల ఎకరాల్లో వరిగడ్డి వర్షాలకు నీటిపాలైనట్లు అంచనా వేస్తున్నారు. పిప్పర, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, కొందేపాడు, గణపవరం, వెలగపల్లి, కొమ్మర తదితర గ్రామాల్లో వరికోతలు బాగా ఆలస్యం అయ్యాయి. ఆ గ్రామాల్లో రైతులు ఇటీవలే మాసూళ్లు పూర్తిచేశారు. ధాన్యం ఆరబెట్టుకోవడం, కొనుగోలు కేంద్రాలకు తరలించడం తదితర పనుల్లో బిజీగా ఉండటంతో వరిగడ్డిని ఒబ్బిడి చేసుకోలేకపోయారు. ధాన్యం అమ్ముకున్న రైతులు కాస్త తీరిక దొరకడంతో వరిగడ్డిని కట్టలు కట్టించడానికి సన్నద్ధం అవుతున్న తరుణంలో అకాల వర్షాలు వరిగడ్డిని ముంచెత్తాయి. దీనితో వరిగడ్డి పనికిరాకుండా పోయిందని, పశుగ్రాసానికి వరిగడ్డిని కొనుగోలు చేయక తప్పదని పలువురు రెతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చు తడిసి మోపెడు

పొలాల్లో యంత్రాలతో కోసిన వరిగడ్డి ఇంటికి తరలించాలంటే ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. యంత్రంతో గడ్డిని కట్టగా కట్టాలంటే ఒక కట్టకు రూ.35 వసూలు చేస్తున్నారు. ఆకట్ట ఇంటికి చేరి గడ్డివాముగా వేయడానికి సుమారు రూ.70 వరకూ ఖర్చు అవుతుంది. వరిగడ్డి కట్టలను ట్రాక్టర్‌పై ఇంటికి తరలించి, కూలీలతో ఆ కట్టలను గడ్డివాముగా వేయడానికి ఐదుగురు కూలీలకు రూ.4 వేలు, ట్రాక్టరు కిరాయి రూ.4వేలు చెల్లించాల్సి వస్తుందని దీంతో గడ్డిపరకే బంగారం అన్నట్లుగా పరిస్థితి తయారైందని రైతులు చెబుతున్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన తరగతులు



భీమదోలులులో విద్యార్థులకు పలు అంశాలను వివరిస్తున్న టీచర్లు బాలాజీ, విజయసింహారావు



నీతి కథలు చెబుతున్న గ్రంథాలయాధికారి రాంబాబు

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం విద్యార్థులు నీతి కథలు శతక పద్యాలను చదివారు. సామూహిక పుస్తక పఠనం చేసి పుస్తక సమీక్షలు రాశారు. రిసోర్స్‌పర్సన్లు తుమ్మల ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్ వారికి అర్థమయ్యే రీతిలో పలు అంశాలను వివరించారు. ఈ శిక్షణ తరగతులను గుంటూరు ఐఐటీ ఫ్యాకల్టీ ఎస్.బాలాజీ, స్కూలు అసిస్టెంట్ వి.విజయసింహారావు సందర్శించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించకుండా చదువుకోవాలన్నారు. మన ఎదుగుదలకు విద్యార్థులే మార్గదర్శకులన్నారు. అనంతరం చిన్నారులు తనుశ్రీ, సిరి చందన, మహనీయశ్రీ నృత్యాలతో అలరించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమాల్లో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో నీతి కథల బోధన

దెందులూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పోతునూరు గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులచే నీతికథలు బోధించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రాంబాబు మాట్లాడుతూ పుస్తకాలు పత్రికలు చదవడం చిన్నప్పటి అలవాటు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు.

ధ్యానం జీవితంలో అంతర్భాగం కావాలి



యోగాలో అరుదైన రికార్డు సాధించిన వారిని సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : ప్రతి విద్యార్థికి సూర్యనమస్కారాలు, ధ్యానం జీవితంలో అంతర్భాగం కావాలని ప్రముఖ యోగా గురువులు పతంజలి శ్రీనివాస్ అన్నారు. జూట్‌మిల్ సమీపంలోని దివ్యజ్ఞాన సమాజంలో ఆదివారం నిర్వహించిన యోగా గురువుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగాలో అరుదైన రికార్డు సాధించినవారిని ఈ సందర్భంగా సత్కరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల యోగా చైతన్య యాత్రల్లో భాగంగా ఏప్రిల్ 7న అరకులో 22 వేల మంది గిరిజన విద్యార్థులతో 108 నిమిషాల్లో 108 సూర్యనమస్కాలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించారు. ఇందులో పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన గుళ్ళ సింధు, చైతన్యలను ప్రశంసాపత్రం, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రేమాలయం నిర్వాహకులు వెంకటేష్ మాస్టారు, మానవతా జిల్లా అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ చాంబర్ మెంబర్ చప్పిడి సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, హెచ్‌ఎం గుళ్ళ ప్రసాదరావు, ఇతర యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీపై కఠిన చర్యలు



నాటుసారాపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

చింతలపూడి: నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సీహెచ్ రాజశేఖర్ హెచ్చరించారు. నాగిరెడ్డిగూడెం గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నాటు సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొందరు అక్రమ లాభాల కోసం నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడి గ్రామం మొత్తానికి చెడ్డపేరు తెస్తున్నారని అన్నారు. ఎవరిపైనా అయినా నాటు సారా కేసులు నమోదైతే వారి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్రంగా నష్టపోతాయన్నారు. పిల్లల విద్య, భవిష్యత్తుపై కూడా దుష్ప్రభావం పడతుందని హెచ్చరించారు. సారా కేసుల్లో పదేపదే పట్టుబడితే వారిపై కఠిన చర్యలతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమ పథకాలు కూడా అందవని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై డయల్ 112 లేదా చింతలపూడి ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్ 94407 96674కు సమాచారం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సై కుటుంబరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో 1999- 2000 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. పదో తరగతి పూర్తయిన 25 ఏళ్ల అనంతరం అందరూ ఒకే వేదికపై కలవడంతో పట్టరానంత ఆనందంతో సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ప్రస్తుత ఉద్యోగ, వ్యాపార, కుటుంబ సంబంధిత విషయాలు పంచుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. హర్షవర్ధన్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను శాలువాలు సత్కరించి సిల్వర్ జూబ్లీ జ్ఞాపికలను అందజేశారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



భీమడోలు టెన్త్ పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్లు

భీమడోలు: ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. భీమడోలు మండల పరిధిలో భీమడోలు, డీపాల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలి రోజు భీమడోలు ఉన్నత పాఠశాలలో 69 మంది, డీపాల్ పాఠశాలలో 45 మంది తెలుగు పరీక్షను రాయనున్నారు. ఇప్పటికే విద్యాశాఖ పగడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఇన్విజిలేటర్లును నియమించింది. భీమడోలుకు చీఫ్ సూపరింటెండెంట్‌గా అహ్మద్, డీపాల్ పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌గా పెనుగొండ భువనేశ్వరరావు వ్యవహరిస్తారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న అన్నదాతలు

కొయ్యలగూడెం: అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి రైతులు తమ పెద్ద మనసును చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే వరికూటి రమేష్ అనే సుమారు 65 సంవత్సరాల వృద్ధుడిని జంగారెడ్డిగూడెం రోడ్డులోని గవర్నమెంట్ హాస్పిటల్స్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఈనెల 17వ తేదీ రాత్రి ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన వృద్ధుడిని రైతులు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లారు. అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ హాస్పటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు చెత్త సామాగ్రి సేకరించుతూ జీవనం పొందుతున్నాడు. అతడికి ఎవరూ లేకపోవడంతో రైతులు కోన దయరాజు, శుక్లబోయిన సుబ్బారావు తదితరులు సొంత ఖర్చులతో రమేష్ మృతదేహానికి హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

దెందులూరులో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న యువత

దెందులూరు: దెందులూరులో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఉగ్రవాదుల ఏరివేత చేపట్టిన భారత సైన్యానికి యావత్తు దేశ ప్రజలు మద్దతుగా నిలవడం అభినందనీయమని అన్నారు. యుద్ధభూమిలో వీర మరణం పొందిన మురళీనాయక్ నివాళులర్పించారు. అనంతరం మాజీ సైనికులకు శాలువాలు కప్పి సన్మానించారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కళ్లకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రదించాలని వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్య నిపుణులు సూచించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో సామాజికవేత్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్రవైద్య శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 122 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 13 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి శస్త్రచికిత్సలు నిర్వహించడానికి వేమగిరి ఆసుపత్రికి తరలించారు. మరో 24 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి సబ్సిడీ ధరకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో చెన్నా వెంకట్రామయ్య, పిల్లి పండరీనాథ్, బలిసెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గాలిగోపుర కలశాల ప్రతిష్ఠాపన



శివాలయం వద్ద కలశాలకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంకాలగూడెం శివాలయం ఎదుట నిర్మించిన రాజగోపురం (గాలిగోపురం)పై ప్రతిష్ఠించే కలశాలకు ఆదివారం రెండో రోజు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, కలశాలకు జలాధివాసం, క్షీరాధివాసం, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నుంచి భద్రకాళి పీఠార్చన చేశారు. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి ఆనంద్ శివాచార్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, శాంతి కళ్యాణం అనంతరం మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య నేర్పడం చాలా అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీలు సంయుక్తంగా స్థానిక ఏఆర్‌డీజీకే హైస్కూల్లో నిర్వహించిన 15 రోజుల సమ్మర్ క్యాంపు ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ హేలాపురి సమ్మర్ క్యాంపు విజయవంతంగా నిర్వహించామన్నారు. మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులకు అందరికీ క్రమశిక్షణ ఒక అలవాటుగా మారాలన్నారు. హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ 80 మంది విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో తమ పేర్లు నమోదు చేసుకుని ఉపయోగించుకున్నారన్నారు. అనంతరం కూల్ డ్రింక్స్ కన్నా ఫ్రూట్ జ్యూస్ మిన్న అనే పేరుతో విద్యార్థులు ప్రదర్శించిన లఘునాటిక, విద్యార్థుల యాంకరింగ్ ట్రైనర్ కె.సోమరాజు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఆయా అంశాల్లో ఇతరుల కంటే బాగా నేర్చుకుని తమ కళలను ప్రదర్శించిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు, మెడల్స్ ఇచ్చి అభినందించారు. 15 రోజుల వేసవి శిక్షణ కార్యక్రమాన్ని హేలాపురి సోషల్ సెంటర్ సూపర్వైజర్ కె.జనని సమన్వయం చేశారు.

అమలు కాని ప్లాస్టిక్ నిషేధం

- పల్లె నుంచి పట్నం వరకు ప్లాస్టిక్ మయం
- క్షేత్రంలో విచ్చలవిడిగా వాడకం
- కొరవడిన క్షేత్రస్థాయి తనిఖీలు
- పట్టించుకోని అధికారులు



ద్వారకాతిరుమలలో నిమ్మకాయల వ్యాపారి చేతిలో ప్లాస్టిక్ కవర్లు



ద్వారకాతిరుమలలో ఓ భక్తుడి చేతిలో ప్లాస్టిక్ కవర్‌లో ఆటబొమ్మలు

ద్వారకాతిరుమల: పాలిథిన్ (ప్లాస్టిక్) కవర్ల నిషేధ చట్టం సరిగ్గా అమలు కావడం లేదు. దుకాణాల్లో బహిరంగంగా ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా పట్టించుకునేవారు లేరు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. విక్రయదారులు, కొనుగోలుదారులు యథేచ్ఛగా ఈ కవర్లను వినియోగిస్తున్నారు. కాగితపు సంచుల వాడకం అసలు కనిపించడం లేదు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. కానీ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు దర్శనం ఇస్తూనే ఉన్నాయి.

నిబంధనలు బేఖాతర్

పల్లెలు, పట్టణాలతో పాటు ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఈ కవర్ల వాడకం ఎక్కువగా ఉంది. ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు లేని దుకాణమంటూ లేదు. కూరగాయల దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ స్టాల్స్‌లో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంది. ద్వారకాతిరుమల మండలంలో నిత్యం 200 కిలోలకు పైగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల దుకాణాల్లో నెలకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా వ్యాపారాలు జరుగుతున్నాయి. 40 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న కవర్ల విషయంలో అసలు నిబంధనలు పాటించడంలేదు. ఏ మురుగు నీటి కాలువలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనం ఇస్తున్నాయి. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వందల ఏళ్లు పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలు వేయడం వల్ల అందులోని విషపదార్థాలు ఆహారంలో కలిసిపోతాయి. వాటిని తినడం వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా ప్లాస్టిక్ వస్తువులను కాల్చడం ద్వారా విడుదలయ్యే విషవాయువుల వల్ల ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, కేన్సర్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

క్షేత్రంలో విచ్చలవిడిగా వాడకం

ద్వారకాతిరుమల క్షేత్రంలో భక్తులు కవర్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కొండపైన పలు దుకాణాల్లో కవర్ల విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. భక్తులు ఏ వస్తువు కొన్నా వ్యాపారులు వాటిని కవర్లలో పెట్టి ఇస్తున్నారు. దాంతో ఏ భక్తుడి చేతిలో చూసినా కవర్లే కనిపిస్తున్నాయి. అలాగే క్షేత్రంలో నిమ్మ, జామ కాయలు విక్రయించే వారు, ఇతర వ్యాపారులు కవర్లలో వాటిని విక్రయిస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

జబ్బులు తప్పవు



ప్లాస్టిక్ కవర్లలో పెట్టిన ఆహార పదార్థాలను తినడం వల్ల జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌లోని విష పదార్థాలు ఆహారంలో కలసి పోవడం వల్ల కేన్సర్‌తోపాటు గుండెకు సంబంధించిన వ్యాధులు వస్తాయి. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండే ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంది.
– ప్రవీణ్‌కుమార్, మండల వైద్యాధికారి, ద్వారకాతిరుమల

పూర్తిస్థాయిలో అరికడతాం

ప్లాస్టిక్ కవర్లు విక్రయించొద్దని, వాడొద్దని వ్యాపారులకు ఇప్పటికే సూచించాం. క్షేత్రంలోని హోటళ్ల వంటి దుకాణాల్లో కవర్ల వాడకం 60శాతంవరకు తగ్గింది. పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడతాం.
– ఏవీ సుబ్బరాయన్, డిప్యూటీ ఎంపీడీవో, ద్వారకాతిరుమల